క్లుప్తంగా

బెండపూడి సాధువు ఆరాధనోత్సవాలు ప్రారంభం


బెండపూడి ఆశ్రమంలో పూజలు

తొండంగి: మండలంలోని బెండపూడిలో శ్రీమాన్ పరమహంస చిద్వేంకట రామ బ్రహ్మానంద మహర్షి(బెండపూడి సాధువు) 56వ ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆశ్రమంలోనూ, స్వామీజీ నిర్వికల్ప సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు మహర్షి ఆరాధనోత్సవాలకు తరలివచ్చారు. మూడు రోజుల పాటు ఆశ్రమంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు తెలిపారు.

తపోవనాన్ని సందర్శించిన కాశీ ప్రధానార్చకులు


తపోవనం పీఠాధిపతి సరస్వతీ మహాస్వామిని కలసిన ఓం ప్రకాష్ మిశ్రా

తుని రూరల్: కుమ్మరిలోవలోని శ్రీసచ్చిదానంద తపోవనం ఆశ్రమాన్ని కాశీ విశ్వనాథ ఆలయం ప్రధానార్చకులు ఓం ప్రకాశ్ మిశ్రా శుక్రవారం సందర్శించారు. ఆశ్రమంలో రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామిని కలసి వేదాశీస్సులు పొందారు. తొలుత ఓం ప్రకాశ్ మిశ్రాకు ఆశ్రమ వేద పండితులు, వేద విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట టిక్ నారాయణ ఉపాధ్యాయ, కాశీ శృంగేరి గోపాల్ గంజ్ ప్యాలెస్ ధర్మాధికారి అన్నపూర్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన


గుర్రంపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో శుక్రవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎంలు) వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఈవీఎంల పనితీరు, ఓటరు స్లిప్‌ల పరిశీలన, ఓటు వేయడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ నేత రాఘవ, రెవెన్యూ అధికారి రాజ్‌కుమార్, పోలీస్ కానిస్టేబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కిర్లంపూడి: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఇన్‌చార్జి ఎస్సై నాగార్జునరాజు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బగ్గ రాంబాబు సారా విక్రయిస్తున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. రాంబాబును అరెస్టు చేసి అతని నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


జగ్గంపేటలో పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న సీఐ లక్ష్మణరావు

జగ్గంపేట: స్థానిక అభయ క్షేత్రంలో శుక్రవారం పేదలు, వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. శశి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన దుప్పట్లు, చీరలను జగ్గంపేట సీఐ లక్ష్మణరావు పేదలకు అందజేశారు. శశిఫౌండేషన్ చేస్తున్న సేవాకార్యక్రమాలను సీఐ అభినందించారు. అభయ క్షేత్రంలో పేదలకు అన్నదానం చేయడంపై నిర్వాహకులను ప్రసంశించారు. కార్యక్రమంలో శశి ఫౌండేషన్ చైర్మన్ నీలి నరసింహరావు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

కరప: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మామిడిచెట్ల ఫలసాయానికి శనివారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆధీనంలో ఉన్న పీహెచ్‌సీ ఆవరణలో 14 మామిడి చెట్లు ఉన్నాయని, వీటి ఫలసాయం పొందేందుకు కరప గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు వేలంపాట నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

అపరాలకు తెగుళ్ల బెడద

- ఆదిలోనే పంటలపై దాడి చేస్తున్న తెగుళ్లు
- మందులు పిచికారీ చేస్తున్న రైతులు
- తుని సబ్‌డివిజన్ పరిధిలో 5,500 హెక్టార్లలో సాగు


కాకరాపల్లిలో మినుము పంటకు ముందును పిచికారీ చేస్తున్న రైతు

కోటనందూరు: తక్కువ పెట్టుబడితో ఆశాజనకమైన ఉత్పత్తులు సాధించే అపరాల పంటపై ఆదిలోనే తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ఏటా అపరాల పంటలో వచ్చే ఆదాయం కంటే తెగుళ్ల నివారణకు పెట్టే ఖర్చే అధికంగా ఉంటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెల్టా ప్రాంతంలో మినుము, పెసర ఎకరానికి మూడు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా తెగుళ్లు, ప్రతికూల వాతావరణంతో మెట్టలో కనీసం రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు ఈ ఏడాది ఖరీఫ్ చివరిలో సంభవించిన తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు అపరాల పంట కొంతమేర దెబ్బతింది. రాష్ట్ర ప్రభుత్వం పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పిస్తుందనే ధైర్యంతో రైతులు ముందడుగు వేస్తున్నారు.

ఏటా పెరుగుతున్న పెట్టుబడి

మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సాగునీటి లభ్యత లోటు కారణంగా సార్వాగా వరి, దాళ్వాగా అపరాల పంటలను సాగు చేయడం పరిపాటి. రబీలో సాగు చేసే అపరాల పంటకు తెగుళ్లు, చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలో చోటు చేసుకుంటున్న అసమానతలతో పాటు భూసారం తగ్గిపోవడంతో ఏటా పెట్టుబడి పెరిగిపోతోంది. అపరాల ధరలు కూడా ఏటేటా తగ్గిపోతుండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో...

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది 5,500 హెక్టార్లలో రైతులు అపరాల పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పంట ప్రాథమిక దశలో ఉంది. రెండు, నాలుగు ఆకుల దశలో ఉన్న పంటను ఆకుదొలిచే, ఆకుముడత, పచ్చ పురుగులు ఆశిస్తుండడంతో రైతులు జోరుగా మందులు పిచికారీ చేస్తున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు

అపరాల్లో రెండు, నాలుగు ఆకుల దశలో పచ్చపురుగు వ్యాప్తి చెందడం పరిపాటి అని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ దశలో వేపనూనె లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేస్తే నెల రోజుల వరకూ తెగుళ్ల వ్యాప్తి చెందవు. ఇప్పటికే తెగుళ్ల సోకితే క్లోరిపైరిపాస్ మందును లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్లు లేదా లీటరు నీటికి మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటరు చొప్పున కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను అదుపు చేయవచ్చని అధికారులు తెలిపారు. తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉంటే ఎసిఫేట్ లీటరు నీటికి ఒక గ్రాము లేదా డైమెథోయేట్ 1.5 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

మోతాదుకు మించితే ప్రమాదం



వ్యావసాయాధికారుల సూచనల మేరకే రైతులు క్రిమిసంహారక మందులు వాడాలి. మోతాదుకు మించి మందులు వాడితే అదనపు ఖర్చుతో పాటు భూసారం దెబ్బతినే అవకాశం ఉంది. మెరుగైన సస్యరక్షణ చర్యలతోనే మంచి దిగుబడులు వస్తాయి. భూమిలో నీటి లభ్యత అనుకూలంగా ఉండడంతో పంటను జాగ్రత్తగా కాపాడుకుంటే నష్టం వాటిల్లదు.

– కేజే చంద్రశేఖర్, వ్యవసాయాధికారి, కోటనందూరు

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

తుని: ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి ఈ నెల 23న తుని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున జరిగే గిరి ప్రదక్షిణకు బస్సు సర్వీసు నడుపుతున్నట్లు చెప్పారు. టిక్కెట్టు ధర రూ.3,500గా నిర్ణయించారు. టిక్కెట్లు కావాల్సిన భక్తులు 73829 13216, 73829 13016, 73829 21904 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్యదేవుని దర్శించిన కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ


సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న ఉమా నందూరి

అన్నవరం: కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ ఉమా నందూరి శుక్రవారం సాయంత్రం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు


ఏలేశ్వరంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్ వద్ద మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. వీటి ద్వారా లక్షలాది మందికి లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం ఎల్‌ఈడీ స్కీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో అలమండ చలమయ్య, గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, వాగు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

మండపంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

శంఖవరం: మండలంలోని మండపంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకలయాత్ర నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోవింద్, ఏపీఓ రాజగోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా మాణిక్యం, నక్కా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం


రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు హనుమంతువజ్ఝల అవధాని, కోట వంశీ, ప్రయాగ రాంబాబు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరాం ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

రేపు నల్లగొండమ్మ బోనాల మహోత్సవం


నల్లగొండమ్మతల్లి

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన నల్లగొండమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఎస్.అన్నవరం, కొత్తూ సూరవరం గ్రామాలకు చెందిన మహిళా భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పారదర్శకంగా కులగణన సర్వే


కోటనందూరులో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ


తేటగుంటలో కులగణనను ప్రారంభిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాంబాబురాజు

కోటనందూరు: పారదర్శకంగా కులగణన సర్వే చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్. సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. మండలంలోని టీజే నగరం, కోటనందూరు, పాతకొట్టాం గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలని వలంటీర్లకు సూచించారు. సర్వేకు ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. అలాగే అల్లిపూడి, కాకరాపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను తహసీల్దార్ కుశరాజు పరిశీలించారు.

కులగణనకు శ్రీకారం

తుని రూరల్: ప్రభుత్వం కులగణనతో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు అన్నారు. మండలంలోని 27 సచివాలయాల పరిధిలో శుక్రవారం కులగణనను ప్రారంభమైంది. తేటగుంటలో ఎంపీడీఓ పి.రవికుమార్ ఆధ్వర్యంలో చైర్మన్ రాంబాబురాజు బయోమెట్రిక్ వేసి కులగణనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో కులగణనకు శ్రీకారం చుట్టిందన్నారు. మండలంలో 28,337 కుటుంబాలు ఉన్నాయని, ఆయా కుటుంబాల్లో 81,114 మంది జనాభా ఉన్నట్టు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం


చిల్లంగిలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిహేమాంజలి

కిర్లంపూడి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని కిర్లంపూడి పీహెచ్‌సీ వైద్యురాలు టి.సాయిహేమాంజలి అన్నారు. మండలంలోని చిల్లంగిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య స్టాల్స్‌ను ఆమె సందర్శించి రోగులకు డాక్టర్లు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వైద్యులు టి.సాయిహేమాంజలి, జి.శరణ్య, వి.జ్యోత్స్న, శాంతిరంజని 364 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమరం శ్రావణి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వెంకటరమణ, దాసరి చినబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా 'అత్తిలి'

కిర్లంపూడి: విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడిగా పని చేస్తున్న అత్తిలి వీరబ్రహ్మం కాకినాడ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సంఘ రాష్ట్ర స్థాయి నాయకుల సమక్షంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు చెప్పారు. గానుగుల శ్రీనివాస్, కొత్తల ప్రసాద్, లక్కోజు కోటేశ్వరరావు, పలువురు సంఘ సభ్యులు వీరబ్రహ్మానికి శుభాకాంక్షలు తెలిపారు.

మండల స్థాయి క్రికెట్ పోటీల విజేత రాజపూడి జట్టు


మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన రాజపూడి టీమ్

జగ్గంపేట: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రికెట్ పోటీల విజేతగా రాజపూడి జట్టు నిలిచింది. రాజపూడి జెడ్పీ హైస్కూల్ మైదానంలో శుక్రవారం మండల స్థాయి క్రికెట్ పోటీల ఫైనల్ మ్యాచ్ జగ్గంపేట, రాజపూడి జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. రాజపూడి టీమ్ విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైంది. తొలుత పోటీలను ఎంపీపీ అత్తులూరి నాగబాబు ప్రారంభించారు. మండలస్థాయిలో 24 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూసాల విష్ణుమూర్తి, ఎంపీటీసీలు నంగన నాని, దేవరరాజు, పినిశెట్టి లోవబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు
- సామాజిక సమతా సంకల్ప సభకు భారీగా తరలిన జనం


యర్రవరంలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు కోరారు. విజయవాడలో సామాజిక సమతా సంకల్పం సభ, అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లే బస్సులను మండలంలోని యర్రవరంలో శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో జరిగే సామాజిక సమతా సంకల్పం సభకు నియోజకవర్గం నుంచి వందలాదిగా తరలి వెళ్లారన్నారు. చైతన్యమూర్తి అంబేడ్కర్ స్మృతివనం ఆవిష్కరణ హర్షణీయమన్నారు. అన్నివర్గాల ప్రజలకూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేత వరుపుల సూరిబాబు, గోళ్ల కాంతిసుధాకర్, బెహరా రాజేశ్వరి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సంకల్ప సభకు తరలిన జనం

తుని రూరల్: విజయవాడలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్ప సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. మండలంలోని తేటగుంట, ఎస్.అన్నవరం, హంసవరం, ఎన్.సూరవరం, డి.పోలవరం తదితర గ్రామాల నుంచి నాలుగు ప్రత్యేక బస్సుల్లో 215 మంది విజయవాడకు వెళ్లినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గండేపల్లి: విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణకు గండేపల్లి మండలం నుంచి ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్లారు. గండేపల్లిలో బస్సులను ఎంపీపీ చలగళ్ల దొరబాబు జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడకు వెళ్లిన వారిలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు: విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ మహోత్సవానికి ప్రత్తిపాడు మండలం నుంచి భారీగా ప్రజలు, నాయకులు తరలివెళ్లారు. ప్రత్తిపాడులో మూడు ప్రత్యేక బస్సులను జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, పార్టీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు ప్రారంభించారు.

రౌతులపూడి: విజయవాడలో శుక్రవారం జరిగే సామాజిక సమతా సంకల్ప సభకు రౌతులపూడి మండలం నుంచి వందలాది మంది తరలివెళ్లారు. వైఎస్సార్ సీసీ నియోజకవర్గ ఇంచార్జి వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, ప్రజలు ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసిరెడ్డి జమీలు, వాసిరెడ్డి భాస్కరబాబు, రాపర్తి రామకృష్ణ, సోమరౌతు రాజా తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం: విజయవాడలోని స్వరాజ్య మైదాన్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అన్నవరం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, ఎంపీటీసీ దడాల సతీష్, వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, సింగంపల్లి రాము, కొల్లు చిన్నా, కొమిరిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు జగ్గంపేట మండలం నుంచి ఎనిమిది బస్సులు, 10 కార్లలో దళిత నేతలు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు శుక్రవారం తరలి వెళ్లారు. జగ్గంపేటలో బస్సులను వైఎస్సార్ సీపీ నేత అత్తులూరి సాయిబాబు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు గఫూర్, కాపారపు రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.


గోకవరంలో బస్సులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవ సభకు శుక్రవారం మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. జగ్గంపేట, గోకవరం, గండేపల్లి, కిర్లంపూడి మండలాల నుంచి సుమారు 15 బస్సుల్లో 800 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు విజయవాడకు పయనమయ్యారు. ఈ బస్సులను పార్టీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. గోకవరం నుంచి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలుతో పాటు సుమారు 200 మంది సామాజిక సమతా సంకల్ప సభకు తరలివెళ్లారు.


రౌతులపూడి మండలం నుంచి విజయవాడకు బయలుదేరిన నాయకులు, ప్రజలు


అన్నవరం నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు


తేటగుంట నుంచి సామాజిక సమతా సంకల్ప సభకు బయలుదేరిన జనం


జగ్గంపేటలో బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న అత్తులూరి సాయిబాబు